విశాలాంధ్ర



తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 29, ఏప్రిల్ 2025 8 పేజీలు

డిసిసిబి చైర్మన్‌గా అమాస రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డిసిసిబి) చైర్మన్ గా అమాస రాజశేఖర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని నగిరి నియోజకవర్గానికి చెందిన అమాస రాజశేఖర్ రెడ్డి గతంలో కూడా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ గా పనిచేశారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. గతంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ గా రెండుసార్లు ఆయన ఎంపికయ్యారు,గత ఎన్నికల్లో టిడిపి విజయానికి ఆయన కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఈ పదవికి పలువురు పోటీ పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పై మంచి పట్టు ఉన్న అమాస రాజశేఖర్ రెడ్డి ని బ్యాంక్ చైర్మన్ గా నియమించారు. అలాగే డిసిఎంఎస్ చైర్మన్ గా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడును నియమించారు .

ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదు మంది దుర్మరణం

కంటైనర్ను వెనకనుండి వేగంగా ఢీకొన్న కారు ఐదు మంది మృతి ,ఇరువురికి తీవ్ర గాయాలు

వార్త మెయిన్‌లో

ఏసీబీ వలలో శ్రీకాళహస్తి సర్వేయరు

- రూ.25వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండల సర్వేయరు పురుషోత్తమరెడ్డి సోమవారం చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.25వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నా యి. శ్రీకాళహస్తి పట్టణం పానగలు కు చెందిన చంద్రశేఖర్ రెడ్డి విశ్రాంత ఐటీఐ ప్రిన్సిపాల్. ఈయన తనకు ఉన్న 75సెంట్లు వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేసుకునేందుకు రెండు పర్యాయాలు మ్యుటేషన్ కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఏ కారణాలతోనే రెవిన్యూ అధికారులు ఇతని మ్యుటేషన్ ను రెండు పర్యాయాలూ తిరస్కరించారు. దీంతో చంద్రశేఖర్ రెడ్డి నేరుగా శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయానికి వచ్చాడు.

2లో

నత్తం కండ్రిగ దళితవాడలో నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలి

- ప్రభుత్వాలు మారినా దళితుల తలరాత మారదా?
- నత్తం కండ్రిగ దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి, అధికారులు స్పందించకపోతే సిపిఐ పార్టీ తరపున ఇంటి స్థలాలను పంచుతాము
- సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రామానాయుడు డిమాండ్

విశాలాంధ్ర-పుత్తూరు: నగిరి మున్సిపాలిట లోని తొమ్మిదవ వార్డులోని నెత్తం కండ్రిగ దళితవాడలో నివాసం ఉంటున్న ఇళ్లకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమ వారం నత్తం కండ్రిక లోని దళితవాడ నందు ఆ గ్రామ నాయకులు ఢిల్లీ బాబు చంద్ర, యేసయ్య అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి గా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పూరిళ్లు నిర్మించుకొని సుమారు 80 కుటుంబాల వారు జీవిస్తున్నారు. ఎన్నికల్లో ప్రతిసారి మాకు ఓట్లు వేయండి మీకు ఇంటి పట్టాలిప్పిస్తా మని చెప్పి 30 ఏళ్లు మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తులు పేదలకు జవాబుదారీగా ఉంటూ వాళ్ల సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేయాలని ఆ విధంగా కాకుండా దళితులను ఒక ఓటు యంత్రం గా చూడడాన్ని సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి స్థలాలు లేని నిరుపేద లకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దళితుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులకు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారు గొంతెమ్మ కోరికలు కోరలేదని, వారు నివాసం ఉంటున్న స్థలాలకు పూరిగుడిసెలకు రెండు సెంట్లు పట్టాలు ఇవ్వాలని కోరడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు పది సంవత్సరాల క్రితం ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్న వారికి ఆ స్థలంలోనే ఇంటి పట్టాలిస్తామని ప్రకటించినప్పటికీ అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోలేదు. కావున అధికారులు వెంటనే స్పందించి దళితులు నివాసం ఉంటున్న వారి ఇంటి పట్టాలిచ్చి అర్హులైనవారికి ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతున్నామన్నారు. నత్తం కండ్రిగ దళితవాడలో ఉన్న దళితులకు న్యాయం చేయాలని, ఈ సమస్యపైన స్థానిక ఎమ్మెల్యే కూడా దృష్టి సారించాలని కోరారు. మొత్తం అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని పూర్తిగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మేమే లేఅవుట్ వేసి పేదలకు ఇంటి స్థలాలు పంచి పెడతామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నగరి నియోజక వర్గ కార్యదర్శి కోదండయ్యా, సిపిఐ పార్టీ ఏఐవైఎఫ్ నాయకులు మహేంద్ర, ఢిల్లీ బాబు, సురేష్, జేమ్స్, జ్ఞానరాజ్, గ్రామ కమిటీ నాయకులు యేసయ్య, బాబు, సురేష్, రాజ, వేలు, జేమ్స్, కుప్పయ్య, భారతి, కాంచన, ఐశ్వర్య, లైలా, కుండెమ్మ, రాణి, మేఘన, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా తెదేపా కౌన్సిలర్ సెల్వరాజు

విశాలాంధ్ర – కుప్పం: కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవిని టీడీపీ ఖాతాలో వేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ పదవికి డా. సుధీర్ రాజీనామా చేయడం నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నూతన చేర్మెన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వడంతో 24 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా 14 మంది టీడీపీ మద్దతు తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరం నందు ఆర్డిఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పురపాలక సంఘం అధ్యక్ష పదవికి ఉప ఎన్నిక నిర్వహించారు. పట్టణంలో ఉన్న 24 మంది కౌన్సిలర్లలో 22 మంది హాజరు కాగా, ప్రజా ప్రతినిధుల కోటాలో తెదేపా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, వైకాపా ఎమ్మెల్సీ భరత్ ఓటర్లుగా పాల్గొన్నారు. టిడిపి తరపున అధ్యక్ష అభ్యర్థిగా సెల్వరాజు పేరును 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము ప్రతిపాదించగా, 20వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్ బలపరచడం జరిగింది. అదేవిధంగా వైసీపీ తరపున 9 వ వార్డు కౌన్సిలర్ హఫీజ్ పేరును రెండవ వార్డు కౌన్సిలర్ మునిరాజు ప్రతిపాదించగా, ఏడవ వార్డు కౌన్సిలర్ నాగరాజు బలపరచారు. అనంతరం జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 24మంది ఓటర్లు ఉండగా అందులో 9మంది

2లో

రేపు శ్రీవారి సేవల జూన్ నెల కోటా ఆన్‌లైన్‌లో విడుదల

విశాలాంధ్ర -తిరుమల కల్చరల్: శ్రీవారి సేవ స్వచ్ఛంద సేవ జూన్ నెల ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 30న టీటీడీ విడుదల చేయనుంది విడుదల సమయ వివరాలు: జనరల్ శ్రీవారి సేవ (తిరుమల, తిరుపతి) ఉదయం 11:00 గంటలకు వనిత సేవ (మహిళలకు మాత్రమే) మధ్యాహ్నం 12:00 గంటలకు పరకామణి సేవ (పురుషులకు మాత్రమే) మధ్యాహ్నం 1:00 గంటలకు గ్రూప్ లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించిన

2లో

శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి

విశాలాంధ్ర-సత్యవేడు: భారత్ లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమ వారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్ లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, ఇతర అధికారులతో కలిసి పర్యటనకు విచ్చేయగ, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు.తొలిసారి శ్రీసిటీ సందర్శనేఅజెండాగా జపాన్ రాయబారి ఇక్కడ పర్యటనకు రావడం తమకు గర్వంగా ఉందని ఈ సందర్భంగా డా.సన్నారెడ్డి వ్యాఖ్యానిం చారు. రాయబారికి శ్రీసిటీ ప్రగతిని వివరిస్తూ, 31 దేశాలకు చెందిన 235 కంపెనీలకు నిలయమైన శ్రీసిటీ, దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా పేర్కొన్నారు.

2లో

శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి

(మొదటి పేజీ తరువాయి) జపనీస్ సంస్థలకు భారతదేశంలో రెండవ అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా అవిర్భవించిందన్నారు. భారీ కంపెనీలతో పాటు పలు అనుబంధ పరిశ్రమలతో శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ప్రధానంగా ఆయన దృష్టికి తెచ్చారు.పరిశ్రమ, విద్య, సుస్థిరత మూలస్తంభాలుగా అభివృద్ధి నమూనాను పెంపొందించడంలో శ్రీసిటీ నిబద్ధతను వెల్లడించారు శ్రీసిటీ అభివృద్ధి,వ్యాపార అవకాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించడంతో పాటు ఇండో-జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చేస్తున్న చురుకైన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.జపాన్ లోని హిరోషిమా, టొయామా, ఎహైమ్ ప్రాంతాల వ్యాపార ప్రతినిధులు ఇటీవలి శ్రీసిటీ సందర్శనలను ఉటంకిస్తూ, జపనీస్ వ్యాపారవేత్తలకు శ్రీసిటీ అత్యంత అనువైన గమ్యస్థానంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జపాన్ పెట్టుబడిదారులకు శ్రీసిటీ వ్యాపార అనుకూలతలను సిఫారసు చేస్తానన్నారు. శ్రీసిటీలోని వివిధ జపనీస్ కంపెనీలకు చెందిన ఉన్నతాధికారులతో లంచ్ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కంపెనీల ప్రతినిధులు, తమ అభిప్రాయాలను, ఆలోచనలను ఆయనతో పంచుకున్నారు. తదనంతరం స్థానిక డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు.

కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా తెదేపా కౌన్సిలర్ సెల్వరాజు

(మొదటి పేజీ తరువాయి) వైసీపీ అభ్యర్థికి ఓటు వేయగా, 15 మంది టిడిపి అభ్యర్థికి ఓటు వేయడం జరిగింది. టిడిపి అభ్యర్థికి ఎక్కువ మెజారిటీ రావడంతో సెల్వరాజును అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నికల అధికారి ప్రకటిస్తూ, తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యుల సమక్షంలో ధ్రువపత్రాన్ని పురపాలక సంఘం నూతన అధ్యక్షులకు అందజేశారు. 5 వార్డు వార్డు క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన సెల్వరాజు మున్సిపల్ చైర్మన్ గా ఎన్నిక కావడం పై తెదేపా శ్రేణులు హర్షం వ్యక్తం చేసాయి. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, తిరుపతి గంగమాంబ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి, ర్యాలీగా తెదేపా కార్యాలయం కు ర్యాలీగా తపకాయలు పెల్చుతూ వెల్లి సంబరాలు చేసుకొన్నారు.

రేపు నేదురుమల్లి రాక

విశాలాంధ్ర-వెంకటగిరి: వైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలనుంచి నుంచి వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉండనున్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 వినతులు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 35 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, ఆరని సంధ్య, అనిల్ కుమార్ విచ్చేసి తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ చేపల మార్కెట్ ఎదురుగా కాలువలు సరి చేయాలని, అన్నారావు కూడలి వద్ద రోహిణి అపార్ట్మెంట్ వద్ద నీటి సమస్య పరిష్కరించాలని, తిరుచానూర్ వెళ్ళే మార్గంలో గరుడ వారధి పనులు సక్రమంగా పూర్తి చేయాలనికోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి సి పి మహా పాత్ర, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి.ఈ.లు, ఏసిపి లు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడులకు కార్పొరేట్ మెరుగులు

అంగన్ వాడీలకు నూతన భవనాలు

ఒక్క రోజులో కోటి దాటిన ముక్కంటి ఆదాయం

అమరావతి రాజధాని భూమి పూజలకు తరలిరండి

ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రభుత్వ బడులను ఆధునీకరించి కార్పొరేట్ మెరుగులు దిద్దనున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. అంగన్ వాడీ భవనాలు దెబ్బతిన్న స్థానంలో నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో సోమవారం పదోతరగతిలో ప్రభుత్వ బడుల్లో చదువుతూ పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనభరచిన మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికతోపాటు సాపత్రాలను అందించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి అవసరమైన అన్ని సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు పుస్తకాల మోత తప్పించడానికి సబ్జెక్టుల వారీగా కుదింపులు చేస్తూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. మంచి క్వాలిటీతో కూడిన యూనిఫాం, బ్యాగులు, షూలను ఈ విద్యాసంవత్సరం నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో కూడా సన్నబియ్యంతో కూడిన మంచి పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో దుస్థితికి చేరుకున్న ప్రభుత్వ బడులను బాగు చేసి కొత్త అందాలు తీసుకొస్తామని చెప్పారు. విద్యార్థుల మంచి నీటి సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే వేసవిలో చిన్న పిల్లల అవసరం మేరకు తరగతి గదుల్లో ఏసీలను ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పలుచోట్ల అంగన్ వాడీ భవనాలు దుస్థితికి చేరుకున్నాయని ఆ స్థానంలో కొత్త భవనాలను నిర్మించడానికి ఒక ప్రముఖ సంస్థ ముందుకొచ్చినట్లు చెప్పారు. త్వరలోనే ఆ భవనాలకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయన్నారు. పదో తరగతిలో పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలానే తమ ప్రతిభతో ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలని అకాంక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారులకు అడ్డకట్టవేసి అక్రమాలకు చెక్ పెట్టిన ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. అమావాస్య సందర్భంగా ఒక్క రోజే ముక్కంటి ఆదాయం రికార్డు స్థాయిలో ఎప్పుడూ లేని విధంగా ఒక కోటి రెండు లక్షల రూపాయలు వచ్చిందని తెలిపారు. ఎన్నో గాడి తప్పిన ఆలయ పరిపాలనను చెక్కబెడుతూ కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ చేస్తున్న కార్యక్రమాలను కొంత మంది దుష్ప్రాచారం చేయడాన్ని ఆక్షేపించారు. లోటుపాట్ల కోసం కనిపెట్టుకుని మరీ వేచిచూసి ఫోటో, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. జర్నలిజం వృత్తి పవిత్రమైనదేకాదు ఎంతో ఉన్నతమైన విలువలు కలిగినదన్నారు. అయితే కొంత మంది య్యూటూబ్, పీడీఎఫ్ పేరిట అసాంఘిక శక్తుల్లా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. అంతేకాదు త్వరలో కూటమి ప్రభుత్వం య్యూటూబ్, పీడీఎఫ్ ల పేరుతో సాగే కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రత్యేక చట్టం తీసుకొస్తోందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, అమరావతి భూమి పూజకు రండి... మన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ భూమి పూజకు తరలిరావాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ల సారధ్యంలో మే 2వ తేదీన జరిగే ఈ భూమి పూజా కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి ఎవరు ఈ భూమి పూజా కార్యక్రమానికి రావాలన్నా అందుకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఏసీబీ వలలో శ్రీకాళహస్తి సర్వేయరు

(మొదటి పేజీ తరువాయి) డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్ కుమార్ ను కలిసి తన సమస్య విన్నవించాడు. మ్యుటేషన్ కావాలంటే మండల సర్వేయరు పురుషోత్తంరెడ్డిని కలవాలని డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్ కుమార్ సూచించారు. దీంతో చంద్రశేఖర్ రెడ్డి నేరుగా మండల సర్వేయరు పురుషోత్తంరెడ్డిని కలిశారు. మ్యుటేషన్ చేయాలంటే రూ.30వేలు ఇవ్వాలని సర్వేయరు పురుషోత్తం రెడ్డి డిమాండు చేశారు. పురుషోత్తంరెడ్డికి రూ.25 వేలు ఇవ్వడానికి విశ్రాంత ఐటీఐ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే లంచం ఇవ్వడానికి ఇష్టం లేక చంద్రశేఖర్ రెడ్డి తిరుపతి అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించారు. వారు పక్కా ప్రణాళిక రచించారు. శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయంలో చంద్రశేఖర్ రెడ్డి నుంచి సర్వేయరు పురుషోత్తంరెడ్డి రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా తిరుపతి అవినీతి నిరోధకశాఖ అడిషనల్ ఎస్పీ విమల కుమారి, డీయస్పీ ప్రశాంతి తమ సిబ్బందితో కలిసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈయనపై విచారణ చేస్తున్నారు. ఈ లంచం విషయంలో తహసీల్దారు కార్యాలయంలో పని చేసే ఇతర ఉద్యోగులకు సంబంధం లేదని... కేవలం పురుషోత్తంరెడ్డి మాత్రమే ఈ లంచం డిమాండు చేశారని ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి మీడియాకు తెలిపారు. ఇతనిని న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండు చేస్తే అవినీతి నిరోధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. కాగా విశ్రాంత ఐటీఐ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ భూమిని వ్యాపారానికి అనుగుణంగా మార్పు చేసేందుకు సర్వేయర్ రూ.30 వేలు డిమాండ్ చేశారని... రూ.25 వేలకు ఒప్పుకొని నగదు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారని తెలిపారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించింది. స్థానిక ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తహసీల్దారు కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

రేపు శ్రీవారి సేవ జూన్ నెల కోటా ఆన్‌లైన్‌లో విడుదల

(మొదటి పేజీ తరువాయి) సేవ) మధ్యాహ్నం 2:00 గంటలకు ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సూచనల మేరకు శ్రీవారి సేవ యొక్క నాణ్యతను మెరుగుపరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు శ్రీ సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు) వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించి అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకొచ్చింది. ఈ మార్పులు ఏప్రిల్ 30న కొత్తగా రూపొందించిన అప్లికేషన్ ద్వారా అమలులోకి రానున్నాయి. ముఖ్యాంశాలు ఇకపై "గ్రూప్ లీడర్స్‌గా" సీనియర్ సేవకులు గత రెండు సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సేవలో పాల్గొంటున్నారు. వయస్సు 45 సంవత్సరాలు నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారు నమోదు కావచ్చు. ఇప్పుడు వీరిని "గ్రూప్ లీడర్స్" అని పిలుస్తారు. వీరు 15 రోజుల, ఒక నెల లేదా మూడు నెలల వ్యవధిలో సేవ చేయడానికి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవచ్చు. గ్రూప్ లీడర్స్ బాధ్యతలు ఈ గ్రూప్ లీడర్స్ శ్రీవారి సేవకుల పనిని పర్యవేక్షించడం, సేవకు వారి హాజరు తీసుకోవడం, మరియు ప్రతి ఒక్క సేవకుని/సేవకురాలి పనితీరును మూల్యాంకనం చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. పరకామణి సేవలో జనరల్ పురుష సేవకులకు అవకాశం కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన పురుషులకు పరకామణి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఆన్ లైన్ ద్వారా పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చని తెలియజేయడమైనది.

కోట బార్అసోసియేషన్ అధ్యక్షుడిగా మధుసూదన్ రావు

విశాలాంధ్ర-కోట: కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా మధుసూదన్ రావు ఎన్నికైనట్లు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి ఎల్.రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలో కోర్టు ఏర్పాటు చేసిన 39 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించడం జరిగిందని ఈఎన్నికలలో ప్రెసిడెంట్ అభ్యర్థిగా మధుసూదన్ రావు, మహేష్ లు పోటీచేయగా మధుసూదన్ రావు 4ఓట్లు మెజారిటీతో గెలుపొందారని, వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా అత్తికాయల మోహన్ యాదవ్,రాజమాణిక్యం పోటీచేయగా 4 ఓట్లు మెజారిటీతో మోహన్ యాదవ్ గెలుపొందారని అలాగే సెక్రటరీగా వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా పీవీ.రమణయ్య, ట్రెజరర్ గా కాటయ్య, ఈసీ మెంబర్స్ గా సూర్య,సాగర్ లను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓం శక్తి ఆలయానికి స్థలం చూపించాలని వినతి



విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణ వనం నారాయణ వనం మండల కేంద్రంలోని బీసీ కాలనీ వద్ద ఓం శక్తి ఆలయ నిర్మాణానికి స్థలం చూపించాలని నారాయణవనం తాసిల్దార్ జయరాములు ఉమ్మడి జిల్లా క్రియా శీల కార్యదర్శి టి రాకేష్ కిరణ్ వినతి పత్రం అందించి మాట్లాడుతూ భక్తులు కోరిక మేరకు స్థలం కేటాయించాలని తాసిల్దార్ తో కోరడం జరిగింది ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ నాయకురాలు శంకరయ్య శివ గోవింద స్వామి అశోక్ పి.జి.బాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు

లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఆర్.వి.రావు

విశాలాంధ్ర-గూడూరు: లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 316-కి గూడూరు నుండి గత 30 సంవత్సరాలు తరువాత 2025-26 సంవత్సరానికి వైస్ డిస్ట్రిక్ గవర్నర్‌గా ఎంపికైన లయన్ ఆర్వీ రావు (రావల వెంకటేశ్వర్లు)ను గూడూరు పట్టణంలోని హోటల్ మహేంద్ర ఎలైట్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి గూడూరులోని మూడు లయన్స్ క్లబ్‌లు కలిసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మూడు లయన్స్ క్లబ్స్ ప్రెసిడెంట్స్, సెక్రెటరీస్, ట్రెజరర్స్, సీనియర్ సభ్యులు, మెంబర్స్ గూడూరు లో ఉన్న రెండు రోటరీ క్లబ్స్ ప్రెసిడెంట్స్, సెక్రెటరీస్, ట్రెజరర్స్, సీనియర్ సభ్యులు మెంబర్స్ అలాగే గూడూరు లోని అన్ని సేవ సంస్థలు ప్రతినిధులు పాల్గొని సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ జనార్ధన్ రెడ్డి పాల్గొని ఘనంగా సన్మానించారు. అనంతరం ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచు రామయ్య, రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిని సన్మానించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి కోర్ట్ న్యాయ మూర్తి జస్టిస్ అనూష బదిలీన సందర్భంగా కోర్టు ఆవరణలో జరిగిన, సన్మాన సభలో పాల్గొన్న ప్రముఖ న్యాయవాది లక్కమనేని కోటేశ్వరరావు మరియు సహచర న్యాయవాదులు.

బడి ఈడు పిల్లలను గుర్తించాలి

ఏం ఈ.ఓ.కె రవీంద్రనాథ్

విశాలాంధ్ర-బుచ్చి నాయుడు కండ్రిగ: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని మొదటి మండల విద్యాశాఖ అధికారి కె రవీంద్రనాథ్ తల్లిదండ్రులను కోరారు. మండలంలోని వేణుగోపాలపురం, ప్రాథమిక పాఠశాల, నెలవాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమవారం ఉపాధ్యాయ బృందాలు ప్రత్యేక కార్యక్రమం ద్వారా బడి ఈడు పిల్లలను గుర్తించి నూతన ప్రవేశాలకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ అంగనవాడి విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయాలన్నారు, ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు అందుబాటులో ఉన్న నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు ప్రత్యేక దృష్టితో నమోదు కార్యక్రమం చేయాలన్నారు. విద్యా విధానంలో గందరగోళం విషయం తల్లిదండ్రులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో అలాంటి భయాలకు కంగారు పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలవాయి ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ రెడ్డి, పురుషోత్తం, సి.ఆర్.పి ఈశ్వరమ్మ పాఠశాలల చైర్మన్ వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

7 నుంచి చెన్నకేశవుని వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యంత వేడుకగా ఈ ఉత్సవాలునునిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

కమ్యూనిటీ వైద్యశాలలో వైద్యుల కొరతను తీర్చండి

జిల్లా కలెక్టరుకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ కమిటీ వైద్యశాలలో వైద్యుల కొరతను తీర్చాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విన్నవించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి అసోసియేషన్ కమిటీ సభ్యులు హేమభూషణం, ధన, శోభ, టిడిపి నాయకులు మురళి, కోనయ్య తదితరులతో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వైద్యుల కొరతను ప్రస్తావించారు. తమిళనాడుకు సరిహద్దును ఎస్సీ నియోజకవర్గమైన సత్యవేడు ఉండటంవల్ల వైద్యం కోసం నిరుపేదలు కమ్యూనిటీ వైద్యశాలకు వస్తారన్నారు. అయితే అందుకు తగ్గట్టు ప్రస్తుతం వైద్యులు లేకపోవడంతో వైద్య సేవలు నిరుపేద రోగులకు అందడం లేదన్నారు. ఇప్పుడు జరిగిన బదిలీల్లో ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు వేరే చోటుకు బదిలీ అయిన నేపథ్యంలో కొత్త వారిని నియమించాలన్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, అనస్థీషియా వైద్య నిపుణుల పోస్టులు గత కొన్ని ఏండ్లుగా ఖాళీగా ఉందన్నారు. దీనికి తోడు ప్రస్తుతం మరో సీనియర్ డాక్టర్ను పుత్తూరుకు బదిలీ చేయడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల నుంచి బదిలీపై వెళ్లిన వైద్యుల స్థానంలో కొత్త వారి నియామకం ఇప్పటివరకు లేదన్నారు. అందువల్ల ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు, పారా మెడికల్ సిబ్బంది నియమించి పేద రోగులకు వైద్య సేవ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ను విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి చిత్తూరు వైద్య ఆరోగ్య సమన్వయ అధికారితో ఫోన్లో మాట్లాడి వెంటనే డాక్టర్లను నియమించాలని కలెక్టర్ కోరినట్టు ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు.

పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించండి

గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి ముందుగానే పన్నులు చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాత బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పించిందని, ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమేనని వెల్లడించారు. పట్టణ ప్రజలందరూ పన్ను బకాయిలను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని వెంకటగిరి రాజాలు నడుపుతున్న హైస్కూల్ నందు గెట్ టుగెదర్ కార్యక్రమము జరిగింది. 1984-85 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు అందరూ ఆత్మీయంగా కలుసుకొని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులందరూ నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని ప్రముఖ న్యాయవాది లక్కంలేని కోటేశ్వరరావు తెలిపారు. ఎంతో క్రమశిక్షణకు విద్యకు మారుపేరుగా ఆర్యన్ హైస్కూల్ ఉండేదని ప్రభుత్వ చర్రీ పాఠశాలను కాదని పట్టణంలోని విద్యార్థులందరూ ఈ స్కూల్లో ఏరి కోరి చేరే వారని తెలిపారు. ఇలాంటి గురువుల దగ్గర విద్య నేర్చుకోవడం తమ అదృష్టంగా భావించవచ్చునని వారు నేర్పిన విద్యాబుద్ధులు నేటి వరకు అమలు చేస్తున్నామని, స్పెషలిస్ట్ టీచర్లు ఆనాడే ఉన్నారని, నేటి కార్పొరేట్ స్కూళ్లలో ఇలాంటి ఉపాధ్యాయులు కనబడడం చాలా అరుదు అని, వారిని సన్మానించి ఆశీస్సులు తీసుకోవడం మహద్భాగ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు జేబీఎస్ శాస్త్రి, పాపారావు, సుధాకర్ రావు, ఇతర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

మహిళ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో ప్రగతి సేవా సంస్థ అనుబంధ సంస్థ సారధ్యంలో మహిళ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలునిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి ఆట విడుపులో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో మరి కొన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు కూడా ఇందులో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తామని తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ క్రీడా సంబరాలను నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్ సౌమ్యకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు టీచర్ మామదూరు రాధయ్య శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీహరి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు .

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విలువలతో గుణాత్మక విద్యను అందిస్తున్నామని మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమవారం ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ తెలిపారు. కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు అతి సమీపముగా పల్లెల్లో ఉపాధ్యాయుల బృందం ప్రభుత్వ పాఠశాల మనుగడను కాపాడుటకు విద్యార్థుల హాజరు సంఖ్య పెంచుకొనుటకు ఇటీవల విడుదలైన పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థుల ఫొటో, మార్కులతో కరపత్రాలు ప్రచురించి వారి పాఠశాల పరిధిలోని తలారివెట్టు గిరిజన కాలనీని ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్ బాబు కలసి 6వ తరగతిలో విద్యార్థుల ప్రవేశాల కొరకు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా బోధన సాగుతున్నట్లు తెలిపారు. కరపత్రంలో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను గూర్చి వివరించారు, అంకితభావం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే అందరికీ ఉచిత విద్యాబోధన, తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు నగదు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారం,డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ద్వారా 3 జతల యూనిఫాం, స్కూల్ బ్యాగు, షూస్, సాక్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అబ్బాయిలకు బెల్టు కూటమి ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. అలాగే బాల, బాలికలకు ఆధునిక మరుగుదొడ్ల సౌకర్యం, రక్తహీనత నివారణకు రాగిజావ, చిక్కీలు, నెలకు ఒకసారి వైద్యపరీక్షలు నిర్వహణ, ఐరన్, ఫోలిక్ మాత్రలు మరియు నులి పురుగుల నివారణ కొరకు మాత్రలు, విశాలమైన తరగతి గదులు మరియు ఫర్నీచర్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐ.ఎఫ్.పి) ద్వారా డిజిటల్ విద్యాబోధన, విద్యార్థినులకు ఆత్మపరిరక్షణ (కరాటే) శిక్షణ, గ్రంథాలయ పుస్తక పఠనంతో చదవటం మాకిష్టం, శారీరక, మానసిక వికాసానికి వ్యాయామం, క్రీడా పోటీలతో పాటు ఇన్నెర్, ఎన్.ఎమ్.ఎమ్.ఎస్., ఐ.ఐ.ఐ.టి ఉపకార వేతనాలకు శిక్షణ. వంటి వివరాలతో కరపత్రాలతో ప్రచారం చేశారు.

ప్రైవేట్ భూమిలో అనధికారిక నిర్మాణం కలకలం

ఆవుల నీటి తొట్టి నిర్మాణంపై భూస్వామి ఆవేదన

విశాలాంధ్ర-తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని కాలూరు ముస్లింపేట గ్రామంలో ప్రైవేట్ భూమిలో అనధికారికంగా నీటి తొట్టి నిర్మాణం జరుగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. సి. మల్లవరం పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పూర్తిగా తన ఆధీనంలో ఉన్న భూమిలో తన అనుమతి లేకుండా, ఎలాంటి అధికారిక నోటీసు లేకుండా ఆవుల నీటి తొట్టిని నిర్మించడం తీవ్రంగా బాధించిందని భూ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది నా హక్కుల ఉల్లంఘన. చట్టబద్ధంగా నాకు ఉన్న రిజిస్ట్రేషన్ ఉన్న భూమిలో ఇలాంటివి జరగడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. తక్షణమే నిర్మాణాన్ని నిలిపివేయాలని, భూ యాజమాన్యంపై అధికారిక ధ్రువీకరణ చేపట్టాలని కోరుతూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు.

వి.కోట తహసీల్దార్‌గా ఉదయ్ సంతోష్

విశాలాంధ్ర-వి. కోట: మండల తహసీల్దార్ గా పనిచేస్తున్న పార్వతమ్మను ఇటీవల చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా ఆ స్థానంలో ఉదయ్ సంతోష్‌ను నియమించడంతో సోమవారం ఆయన తహశీల్దార్ కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక డిప్యూటీ తహసీల్దార్, మండల రెవెన్యూ అధికారి, గ్రామ పరిపాలనాధికారులు ఆయనను ఘనంగా స్వాగతించారు.

న్యాయమూర్తికి ఘన వీడ్కోలు

విశాలాంధ్ర-గూడూరు: అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి పి లోకనాథం బదిలీ పై వెళ్తుండడం తో సోమవారం గూడూరు బార్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 7వ అదనపు జిల్లా జడ్జి కే.వెంకట నాగ పవన్ సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకరయ్యగూడూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఉమాశంకర్, హరిప్రసాద్, వెంకట కృష్ణయ్య, ఎం శ్రీనివాసులు కమిటి సభ్యులు, న్యాయవాదులు పి సాయికుమార్ రెడ్డి, కొత్తపల్లి వసంత కుమార్, ఎస్ చంద్రమోహన్ రెడ్డి, పీ గోపాల్ రెడ్డి, అంబటి కోటేశ్వర రావు, పిపి సుహాసిని, వనం ప్రసాద్, తీగల చంద్రశేఖర్, కలవలపూడి నవకోటి, సాయి, అనిల్, పి సుమన్, ఈ. మధు,యూసఫ్, నాగూర్, వహీదా, ప్రతాప్ కుమార్, ఏడుకొండలు, సుమన్, విజయ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి బషీర్ తన స్నేహితులతో దిగువ వీధుల్లోని ఓ రైతు బావిలోకి ఈతకు వెళ్లి ఈత రాక చనిపోయాడు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి రామచంద్ర నగర్ కు చెందిన లేటు మహబూబ్ బాషా కుమారుడు బషీర్ (16) చంద్రగిరి పాలిటెక్నికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం తన స్నేహితులు బన్నీ, సాయి, చరణ్, పునీత్ లతో కలిసి బషీర్ దిగువ వీధిలోని ఓ రైతు బావిలోకి ఈతకు వెళ్ళాడు. బావిలోకి దిగిన బషీర్ ఎంతసేపటికి బయటకు రాకపోవటంతో స్నేహితులు స్థానికులకు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు పోలీసులు హుటాహుటిన బావి వద్దకు వెళ్లి బషీర్ ను వెలుపలకి తీసి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు శవ పరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థిక స్వావలంబన

ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించ వచ్చుని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గానికి చెందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతోందన్నారు. అందులో భాగంగానే బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గానికి చెందిన మహిళకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తోందన్నారు. మహిళలు టైలరింగ్ నేర్చుకోవడం వలన కుటుంబ పోషణలో తమవంతు సహకారం అందించవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబంలో భార్య, భర్త ఇద్దరూ కష్టపడితే తప్ప పోషణ గగనంగా మారుతోందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ఈ అవకాశం మహిళలు వినియోగించుకోవాలన్నారు. శ్రీకాళహస్తి పరిధిలో ఇప్పటి వరకు సుమారు 600 మంది మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి గుర్తు చేశారు. మహిళలు స్వయం ఉపాధి పొందడానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కాగా అంతకు మునుపు పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొద్ది సేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనరు బీవీ గిరికుమార్, టీడీపీ నేతలు విజయకుమార్, గుమ్మడిపూడి దశరథాచారి, రంగినేని చెంచయ్యనాయుడు, మిన్నల రవి, తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి, షాకీరాలీ, నాగమల్లి దుర్గాప్రసాద్, పోలూరు శ్రీనివాసులురెడ్డి, జిలానీ బాషా, ఢిల్లీబాబు, బీజేపీ నేత జీవీ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు జిల్లాలో ని బధిరులైన విభిన్న ప్రతిభావంతులకు (మూగ, చెవిటి) వారికి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి స్మార్ట్ ఫోన్ లను అందజేశారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయం లోని జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లోమేనేజింగ్ డైరెక్టర్, ఏపిడిఏఎస్‌సిఏసి విజయవాడ వారు ఆర్థిక సాయంతో అందజేశారు. రూ4.50 లక్షల విలువచేసే తో 30 టచ్ ఫోన్లను జాయింట్ కలెక్టర్ జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడిఏ వై.శ్రీనివాసులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు నగలు అపహరణ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రెండో పట్టణ పరిధిలోని చింపిరి నాయుడు కాలువ ప్రాంతం లో ఉన్న ఓ ఇంట్లో బంగారు చోరీ గురైన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు రెండో పట్టణ సి.ఐ శ్రీనివాస్ కథనం మేరకు చింపిరి నాయుడు కాలువ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిందన్నారు. తను తమ బంధువుల ఇంటికి వెళ్ళాడు అని, సోమవారం ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉందని తెలిపారు. బీరువాలో ఉన్న రెండు న్నర సవర బంగారు నగలు పోయాయని తెలిపారు. అన్నారు.అనంతరం సంఘటన స్థలానికి క్లూస్ టీమ్ చేరుకొని వివరాలు సేకరించింది.అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఆ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎండీ సంతోష రావు మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. చలివేంద్రంలో ప్రతిరోజూ చల్లటి తాగునీటితోపాటు మజ్జిగ కూడా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డివిఎస్ వర కుమార్, కె. ఆదిశేషయ్య, పిహెచ్ జానకీరామ్, జనరల్ మేనేజర్ వై.వెంకట రాజు, ఎన్. నరేంద్ర నాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వేణుగోపాల్ రావు, భాస్కర్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు సురేందర్, శ్రీధర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోర్లు మంజూరు చేయండి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలోని సి.మల్లవరం గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకు జఠిలమవుతుందని, ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని తాగునీటి బోర్లు మంజూరు చేయాలని సర్పంచ్ మొక్కల భారతి తిమ్మారెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల ప్రజా వేదిక కార్యక్రమంలో సర్పంచ్, పలువురు గ్రామస్తులు పాల్గొని ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, యశోద, ఎంపీడీవో రామచంద్రకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మొక్కల భారతి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకముందే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని, అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించి పంచాయతీకి రెండు బోర్లు మంజూరు చేయాలని కోరారు. ఖచ్చితంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, అవసరమైనచోట బోర్లు వేస్తామని ప్రజాప్రతినిధులు అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సి. మల్లవరం పంచాయతీ ప్రజలు, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఆర్థికంగా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఊరటనిచ్చేందుకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నిరంతరం కృషి చేస్తున్నారని ప్రత్యక్షంగా మరోసారి కనిపించింది.తిరుపతి రూరల్ మండలం తనపల్లి రఘునాథ్ రిసార్ట్‌లోని టీడీపీ కార్యాలయంలో,నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన బాధితులకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. తిరుపతి రూరల్, పాకాల, రామచంద్రాపురం, చంద్రగిరి, యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మొత్తం రూ.63,35,783 మంజూరైంది. పార్టీలకు అతీతంగా,ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తించి, వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే పులివర్తి నాని విజ్ఞప్తికి తక్షణమే స్పందిస్తూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించారు.చెక్కులు అందుకున్న బాధితులు భావోద్వేగానికి లోనై,కష్టకాలంలో మా కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి, ఎమ్మెల్యే పులివర్తి నాని కి ధన్యవాదాలు" తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నేతలు,పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలి

- కొత్తగా పెట్టిన బాల సంజీవిని ఈకేవైసీ తీసివేయాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర-చిత్తూరు : అంగన్వాడి సెంటర్లకు మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని, కొత్తగా పెట్టినటువంటి బాల సంజీవిని, 2.0.0 యాప్ లో ఈ కేవైసీ ఓటీపీలు తీసివేయాలని, డిమాండ్ చేస్తూ సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్నటువంటి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, అంగన్వాడి చిన్నారులకు, మే నెల అంతా టేక్ హోమ్ రేషన్ తో సెలవులు ఇవ్వాలని, రూరల్ ప్రాజెక్టులలోని పిల్లలకు పాదరక్షలు కూడా ఉండవని, ఈ మధ్య పదేపదే పల్లెలలో కరెంటు తీస్తున్నారని, అంగన్వాడి సెంటర్లలో కొన్ని చోట్ల ఫ్యాన్లు లేక, పిల్లలకు పాదరక్షలు లేక, కేంద్రాలలో చిన్నారులు ఉండలేక పోతున్నారని, ఎలిమెంటరీ స్కూల్ నుండి, డిగ్రీ, పీజీ, కాలేజీల వరకు అందరికీ సమ్మర్ హాలిడేస్ ఉన్నాయని, అంగన్వాడి చిన్నారులకు మాత్రం సెలవులు లేక, ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, అంగన్వాడి చిన్నారులను దృష్టిలో ఉంచుకొని మే నెల అంతావేసవి సెలవులు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. బాల సంజీవిని యాప్ ఈకేవైసీ, ఓటీపీలు, తీసివేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు, రైసు, దాలు, ఆయిల్, సకాలంలో రేషన్ డీలర్లు, సెంటర్లో చేర్చాలని, జిల్లాలోని డీలర్లు, మొబైల్ డ్రైవర్లు, అంగన్వాడీ టీచర్లను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ మూడు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత ప్రేమ,ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు, ఏఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య జిల్లా అధ్యక్షులు ప్రభావతి జిల్లా నాయకులు అరుణ హైమావతి కాంచన ఏఐటీయూసీ నాయకులు రాజేంద్ర రఘు రవి పాల్గొన్నారు.

సత్తా చాటిన భవిత కేంద్ర విద్యార్థులు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: మానసిక వైకల్యం, అంగ వైకల్యంతో సంబంధం లేకుండా, మార్కుల ప్రభంజనాల గోలతో సంబంధం లేకుండా భవితా కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రత్యేక అవసరాలు విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో విభిన్న ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. సూళ్లూరుపేట మండల స్థాయిలో సెరిబ్రల్ పాలసీ వైకల్యం కలిగిన భవితాకేంద్రం విద్యార్థిని డి.హరిక, సెరిబ్రల్ పాలసీ వైకల్యం కలిగిన గవర్నమెంట్ హైస్కూల్ సులూరుపేట విద్యార్థి పి.శ్రీనివాసులు, బుద్ధిమాంద్యం కలిగిన జెడ్పీహైస్కూలు కోటపోలూరు విద్యార్థి డి. మునిసాగర్ సాధారణ విద్యార్థులతో నిలబడి తమ సత్తా చాటారు. ఈ విజయం స్ఫూర్తిదాయకము అని ఎంఈఓ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ చిన్నారులలో ప్రత్యేకమైన సామర్థ్యాలు దాగి ఉంటాయని, వాటిని ఆధారంగా చేసుకుని వీరికి శిక్షణ ఇస్తే వారు ఇలాంటి ఫలితాలు మరెన్నో సాధించగలరని భవితా కేంద్ర ఉపాధ్యాయురాలు వి.టి.భార్గవి తెలిపారు. ఈ విజయం మాకు చాలా గర్వంగా ఉందని చెప్పు, వీరిని ఇంతటితో ఆగకుండా 18 సంవత్సరాల వయసు తర్వాత ఉద్యోగంలో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. విభిన్న విజేతలుగా నిలిచిన ఈ చిన్నారులు అత్యున్నత స్థాయిలో ఎదిగేలా మేమంతా తోడుగా ఉంటామని ఉపాధ్యాయులు ఉస్మాన్ భాషా భరోసా ఇస్తూ వారందరికీ షీల్డ్ లు అందజేశారు . దివ్యాంగుల హక్కుల వేదిక నాయకురాలు శ్రీమతి శాంతకుమారి గారు మాట్లాడుతూ ఈ విద్యార్థులు సాధించిన ఘనవిజయం మార్కులకు అతీతంగా సాగిన విభిన్న విజయ సూచిక అని అభినందిస్తూ, విద్యార్థులను మరింత ముందుకు వెళ్లాలని ప్రోత్సహిస్తూ ఈ ముగ్గురు విభిన్న విజేతలకు రూ.1000 చొప్పున ఇచ్చి అభినందించారు. ఇలాంటి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తమ సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవితా ఉపాధ్యాయురాలు కుమారి, ఎన్.సాయిసంధ్య, సూర్య కుమారి, కనకమ్మ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి

రిలేనిరాహారదీక్షలో ఎన్ఎంయు రీజనల్ అధ్యక్షుడు పెరుమాళ్

విశాలాంధ్ర-సత్యవేడు: ఆర్టీసీ ఉద్యోగులకు గత నాలుగు సంవత్సరాలుగా ఆగిన పదోన్నతులను వెంటనే కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షులు పెరుమాళ్ డిమాండ్ చేశారు.వివిధ సమస్యల సాధన కోసం ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం సత్యవేడు డిపో ప్రాంగణంలో పలువురు ఎంఎంయు ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా రీజనల్ అధ్యక్షులు ఎస్ జె.పెరుమాళ్ మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం 1/2019 సర్కులర్ అమలు చేయాలన్నారు.మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యోగుల పోరాటం కొనసాగుతుందన్నారు. అంతకుముందు ఎన్ఎంయు రీజనల్ అధ్యక్షులు ఎస్ జె పెరుమాళ్ ఆధ్వర్యంలో డిపో అధ్యక్షులు పార్థసారధిరెడ్డి, వాసుదేవయ్య, గోపాల్, పోలయ్య, విజయన్, గజేంద్రన్, బాలాజీ తదితరులకు ఉద్యోగులు పూలమాలలు వేయడంతో రిలే నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఉదయం 9 గంటల నుంచి రిలే నిరాహార దీక్ష కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్యారేజీ అధ్యక్షులు కుప్పయ్య, సుధాకర్, కుమార్, గోపన్న, ఆనందయ్య, ప్రకాష్, వర్మ, కరీముల్లా, వాసులు, వినోద్ కుమార్, వేణు, పాపయ్య తదితరులు సంఘీభావంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మను చెప్పుతో కొట్టిన కవచ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరిలో కవచార చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుండు మనోజ్ ఆధ్వర్యంలో శివాలయం వీధిలోని బోసు బొమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను చేతిలో పట్టుకొని కాజీపేట సెంటర్ వరకు ఉగ్రవాదం నశించాలి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను చెప్పుతో కొట్టి నిరసన తెలిపారు. మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదం నశించాలి ఉగ్రవాదం పై పోరాడుతాం అని నినాదాలు ఇస్తూ వెంకటగిరి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విష్ణు మోహన్, డాక్టర్ రమేష్ ఎంఆర్పిఎస్ రవి, కంటి పల్లి మనీ బిజెపి నాయకులు రవికుమార్, గంపల రవికుమార్, వంగవీటి మధు దారా శివ తదితరులు పాల్గొన్నారు.

30న నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్

విశాలాంధ్ర-కుప్పం: కుప్పం సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు వినియోగదారులకు దస్తావేజు లేఖరులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్లాట్ పద్ధతి ద్వారా కొనసాగించినట్లు సబ్ రిజిస్టర్ సత్యనారాయణ తెలిపారు. స్లాట్ బుక్ చేసిన సమయానికి వినియోగదారులు హాజరు కావాలని తెలిపారు స్లాట్ బుకింగ్ సమయంకు హాజరుకాని పక్షమున మరుసటి రోజు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వెసులుబాటు కలదని కుప్పం సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. స్లాట్ బుకింగ్ వలన వినియోగదారులకు సమయము వృధా అవ్వదని తెలిపారు. వినియోగదారులు దీని ద్వారా క్యూ లైన్ లలో వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు సులభమైన రిజిస్ట్రేషన్ సేవలను అందించడంలో సహాయపడుతుందని మరి వేగవంతమైన పారదర్శకమైన మరి ఇబ్బందులు లేని రిజిస్ట్రేషన్ సేవల దిశగా ముందుకు వెళ్ళచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఏ వినోద్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

స్త్రీ శిశు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: స్త్రీ శిశు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని కార్వేటిన గరం ఐసిడిఎస్ సిడిపిఓ పద్మసునంద అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని అంగన్వాడి కేంద్రం లోని వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల యొక్క శారీరిక, మానసిక, సాంస్కృతిక అభివృద్ధి పూర్తిస్థాయిలో జరుగుతుందని వివరించారు. అంగన్వాడి కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు బంగారు పునాది వేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ భారతి అంగన్వాడి కార్యకర్తలు జయసుధ, విజయ్ కుమారి, నీరజ, చిరంజీవులు, అరుణకుమారి, పిల్లల తల్లిదండ్రులు ఐసిడిఎస్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ టెన్త్, ఇంటర్ లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అభినందించారు. సోమవారం కలెక్టరేట్ లోని బిసి సంక్షేమ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు జిల్లా కలెక్టర్ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను అభినందిస్తూ ఇంకా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, జిల్లాకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలనీ విద్యార్థులకు సూచించారు. అంతరం విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

వైభవంగా ద్రౌపతీ అమ్మవారి కళ్యాణం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: చవటగుంత మహాభారతం ఉత్సవాలలో భాగంగా సోమవారం ద్రౌపతీ సమేత ధర్మరాజుల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణలు చేసి వధూవరులుగా సిద్ధం చేశారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రాలతో వైభవోపేతంగా కళ్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం విజయకుమారి భగవతారినిచే హరి కథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం అమ్మవారిని పురవీధులలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఉభయదాతలు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తలు రాధాకృష్ణ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.రాత్రి వెంకటేశ్వర నాటక మండలిచే వీది నాటకములు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యనిర్వాహకులు కొండా రెడ్డి, నరసింహారెడ్డి, వరదారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు నగదు స్వాధీనం

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన దోమలపాటి సిద్దులు నాయుడు ఇంటికి పగటిపూటే కన్నం వేసి 30.11.2023 ఇంట్లో ఉండిన బంగారు ఆభరణాల నగదు దొంగలు దోచుకెళ్లారు. సిద్దులు నాయుడు పోలీసుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎస్డిపిఓ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. సుబ్బరామిరెడ్డి తన సిబ్బంది మునిరాజ, పురంధర్, గోపీలు విస్తృతంగా గాలించి ముద్దాయి పులి నరేష్ అద్దెకు కాపురం ఉంటున్న ఎంఆర్ పల్లి పంచాయతీ వైకుంటపురం ఆర్చి సమీపంలోని శ్రీకృష్ణ నగర్ కు వెళ్లి ముద్దాయిని పెద్దమనుషుల సమక్షంలో విచారించి అతని వద్ద నుండి దొంగలించబడిన సుమారు 301 గ్రాములు బంగారం, మూడు లక్షల రూపాయలు నగదు రికవరీ చేసినట్లు డి.ఎస్.పి బేతపూడి ప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్.ఐ అనిత, ముని రాజు, పురంధర్, గోపిలో పాల్గొన్నారు.

నేడు ముక్కంటి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని ఉదయం 7 గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పకుండా ఈ హుండీ లెక్కింపులో పాల్గొనాలని తెలిపారు.

జగనన్న కాలనీలో అవినీతిని వెలికి తీయండి :జనసేన నేత టి.మురళిరెడ్డి

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ లో అప్పటి వైయస్సార్ ప్రభుత్వంలో వైయస్సార్ కాలనీ ఏర్పాటు లో జరిగిన అవినీతి ని వెలుగులోకి తేవాలని చంద్రగిరి జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తపస్సి మురళి రెడ్డి డిమాండ్ చేశారు. ఇందులో బాగంగా ఆయన సాక్ష్యాధారాలు సేకరించడానికి కావాల్సిన సమాచారం కోసం సోమవారం సమాచార హక్కు 2005 చట్టం ప్రకారం వివరాలు కోసం తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. జగనన్న కాలనీ ఏర్పాటు సందర్భంగా అప్పటి రెవెన్యూ అధికారులు, వైయస్సార్ సిపి నాయకులు పోటీపడి ప్రత్యేకంగా అదే పంచాయతీ కి చెందిన వైయస్సార్ సిపి నాయకుడు కోట్లాది రూపాయల అవినీతి కి పాల్పడ్డారని, లేని భూమిని సైతం రికార్డు లో ఉన్నట్లుగా చూపించి లబ్ధి పొందినట్లు ఆయన ఆరోపించారు. కేటగిరీ లు మార్చి ప్రభుత్వ ఖజానాకు భారీ స్థాయిలో గండి కొట్టి వెనకేసుకొన్నారన్నారు. అంతా తానై వ్యవహరించిన సదరు నాయకుడు కి 22 ఎకరాలకు సంబంధించి కమీషన్ చేరలేదని రైతులను బెదిరిస్తున్న ఆడియో ను సైతం తపస్సి మురళి రెడ్డి షోషియల్ మీడియాలో హలచల్ చేశారు. కాలనీ ఇల్లు మంజూరై ఆర్థిక సోమత లేక ఇల్లు కట్టుకోలేక ఖాళీగా ఉంటున్న స్థలాన్ని అధికారులు, సదరు నాయకుడు కలిసి ఇతరులకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తూ పేదలు అయిన యిద్దరినీ మోసగించారని మురళి ఆరోపించారు. అప్పట్లో అధికారం లేక ఎదిరించలేని ప్రతిపక్ష పార్టీ అయిన తెలుగుదేశం ప్రస్తుత అధికారములోకి వచ్చిన తర్వాత అయినా ఈ అవినీతిపై నోరు మెదపకపోవడంపై నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధైర్యం చేసి ముందుకొచ్చిన తపస్సి మురళి రెడ్డిని నష్టపోయిన రైతులు అభినందించడం గమనార్హం.

సాయి గార్డెన్ సిటీ సమస్యల పరిష్కారానికి వినతి

గంగవరం-విశాలాంధ్ర : మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గంగవరం మండల కేంద్రం, సాయి గార్డెన్ సిటీలో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్,పలమనేరు శాసనసభ్యులకు సాయి గార్డెన్ సిటీ కమిటీ వినతి పత్రరం అందజేశారు.వీటిలో ప్రధానంగా అద్వాన్నంగా ఉన్న రోడ్ల సమస్య, కల్వర్టుల సమస్య డ్రైనేజీ పారిశుధ్యం, వీధిలైట్ల సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయం నూతనంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కొరకు అదేవిధంగా నూతనంగా డ్రైనేజీ నిర్మాణం మరమ్మత్తుల కొరకు విడివిడిగా వినతి పత్రాలను అందించారు. 2007వ సంవత్సరం నుంచి ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు పన్నులు మాత్రం చెల్లిస్తున్నామని స్థానికులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే సమస్యలపై స్పందించి పరిష్కారం చూపాలని కోరారు. వీరి వినతులపై జిల్లా కలెక్టర్ మరియు పలమనేరు శాసన సభ్యులు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయి గార్డెన్ సిటీ వాసులు అమర్నాథరెడ్డి వి.వి.రాజు, గుణశేఖరన్, దేవకుమార్, శ్రీకాంత్, శ్రీనివాసులు రెడ్డి, గజేంద్ర, సోమసుందర్ రెడ్డి, బాలకృష్ణ, రాజశేఖర్, రవీంద్ర రెడ్డి, విష్ణుప్రియ రాజు,దాము, దేవనాథ్ రెడ్డి, గోవిందప్ప, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

.

మత్స్యకారుల క్రికెట్ క్రీడాపోటీలు

విశాలాంధ్ర-చిల్లకూరు: తిరుపతి జిల్లా, గూడూరు నియోజకవర్గం , చిల్లకూరు మండలం , తమ్మినపట్నం గ్రామ పంచాయతీ గుమ్మళ్ళదిబ్బ పాతూరులో సోమవారం నెల్లూరు, ప్రకాశం మరియు తిరుపతి జిల్లాలలోని మత్సకారులకు క్రికెట్ క్రీడలో పోటీలను అదానీ ఫౌండేషన్ అధినేత రాజేష్ రంజన్ లాంఛనంగా ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సతీష్ యాదవ్మరియు తిరుపతి పార్లమెంటు మత్స సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మేకల వెంకయ్యలు, మాట్లాడుతూ ఈ నెల 28 నుండి మే నెల 15 వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి 60 వేలు రెండో బహుమతి 40 వేలు మరియు మూడవ బహుమతి 30 వేలు, నాలుగో బహుమతి 20 వేలు, ఐదవ బహుమతి 15 వేలు మరియు ఆరో బహుమతి 10 వేల రూపాయలుగా నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. రాజేష్ రంజన్ మాట్లాడుతూ క్రీడలు స్నేహ భంధం పెంచుతాయని, గెలుపోటములు ముఖ్యం కాదని పాల్గొని అత్యుత్తమ ప్రతిభ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు క్రీఢాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ప్రతి అంశంలోను నిర్వాహకులదే తుది నిర్ణయం అని ప్రతి ఒక్కరూ పోటీలకు మద్దతు పలికి సహకరించి క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. గ్రామ కాపులు , గ్రామ పెద్దలు మాట్లాడుతూ పోటీలను విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారం తప్పక అందిస్తామని హర్షద్వానాల నడుమ కుండ బద్దలు కొట్టినట్టు తెలిపారు.

శ్రీకాళహస్తికి మంచి పేరు తీసుకువద్దాం

-ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: విద్యార్థులు బాగా చదివి శ్రీకాళహస్తికి మంచి పేరు తీసుకురావాలని స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కోరుకున్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. తిరుపతి జిల్లా స్థాయిలో మూడవ స్థానంలో నిలిచిన బాబు అగ్రహారం పాఠశాల విద్యార్థి అనంతపురం కేతన్ ను ప్రత్యేకంగా అభినందించడంతో పాటు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ విద్యా విధానంలో నూతన సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలు వలన రాష్ట్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తారని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆలోచలనకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా పని చేయాలని ఆయన సూచించారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంటుందనే పెద్దల మాట మరువకూడదన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యతో పేదరికం జయించవచ్చన్నారు. పిల్లలు బాగా చదువుకోవడానికి తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ బడుల బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. 'పది'లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే ఏడాదికి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు అంబటి బాలయ్య, భువవేశ్వరి, భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూథి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆ్యధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

రెండవ పట్టణ సీఐగా నాగార్జునరెడ్డి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐగా నాగార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తానన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలుచేయాలి

- ఎన్ఎంయుజిల్లా ట్రెజరర్ మోహన్ డిమాండ్

గూడూరు -విశాలాంధ్ర : 1/2019 సర్క్యులర్ ను విధిగా అమలు చేయాలని, అక్రమ సస్పెండ్ లను ఆపాలని, గ్యారేజీ లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఎన్.ఎం.యు జిల్లా ట్రెజరర్ మోహన్ డిమాండ్ చేశారు.గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపోలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా జాయింట్ సెక్రెటరీ శ్రవణ్, డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, గౌస్, వెంకయ్య,మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పొలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముష్కరుల దాడిని ఖండించిన పెద్ద మసీద్ మత పెద్దలు

విశాలాంధ్ర-వెంకటగిరి : వెంకటగిరి జామియా మసీద్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు కాశ్మీర్లో జరిగిన పర్యాటకులపై ముష్కరుల దాడిని తీవ్రంగా ఖండించారు భారతదేశం హిందూ ముస్లింలు ఐక్యంగా నివసిస్తున్న దేశమును ఈ దేశంలో ఈ రెండు మతాల ప్రజలు అన్నదమ్ముల వలె కలిసి జీవిస్తూ ఉన్నారని వీరిని విభజించడానికి దేశంలో మత కల్లోలాలు లేపడానికి పాకిస్తాన్ మరియు టెర్రరిస్ట్ గ్రూపులు ఇలాంటి పనులు చేస్తున్నారని వీరిని ఏ ఒక్క ముస్లిం సోదరుడు నమ్మరని ప్రపంచంలో టెర్రరిస్ట్ దేశంగా గుర్తింపు పడి సర్వనాశనం అయిపోయిన ఈ దేశాన్ని ఎవరు కాపాడలేరని భారత ప్రభుత్వం వీరిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని నిరసన తెలిపారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు.

కల్లివెట్టులో ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి :సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర - బుచ్చి నాయుడు కండ్రిగ : మండలంలోని కల్లివెట్టు గ్రామంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తూ పట్టాలు అందించాలని సిపిఐ నాయకులు సోమవారం తహసీల్దార్ శ్రీదేవి వద్ద డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ కల్లివెట్టు గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సుమారు 120 కుటుంబాలకు ఐదు సెంట్లు చొప్పున పంపిణీ చేసింది. గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరిట ఒకటిన్నర సెంటు భూములు పంపిణీ చేసింది. అయితే ఖాళీగా ఉన్న స్థలాన్ని 127 మందికి సమానంగా భూకంపం చేయాలని వాటికి ఇంటి పట్టాలు పంపిణీ ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ పాల్గొన్నారు.

మైనర్ బాలికలపై శ్రద్ధ తీసుకోండి

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని మైనర్ బాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి నీలకంఠేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి మైనర్ బాలికలు వారి యొక్క బాల్యవివాహాలపై వారు తీసుకున్నటువంటి ఆహారము విద్య. మొదలగు వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు అలాగే మైనర్ బాలికలు బాల్య వివాహాలను చేసుకుంటే వారి మీద ప్రోక్సో చట్టం కింద వారిని శిక్షించాల్సిన అవసరం ఉంటుందన్నారు ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామంలో ఉన్నటువంటి పిల్లల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎదుగుదలకు కావలసినటువంటి కిషోర్ బాలిక వ్యవస్థను కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరత్నమ్మ.యు ఆర్ డి మహేశ్వర్ రెడ్డి ఎంఈఓ భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర- పెనుమూరు: మండలంలోని పారిశుధ్యం పై పంచాయతీ కార్యదర్శులకు క్లాప్ మిత్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ. మండ లంలోని పారిశుధ్యం పై పంచాయతీ కార్యదర్శులకు మరియు క్లాప్ మిత్రులకు తడి చెత్త పొడి చెత్త ఎలా వేరు చేయాలి ఏ విధంగా దాని సమకూర్చుకోవాలి దానిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు క్లాత్ మిత్రులకు వారి యొక్క ఆదాయం ఎలా పెంచుకోవాలి? తడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలి అన్నదానపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆర్ డి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం:ఎంపిపి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ప్రజల సమస్యలను సమగ్రంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు చిత్తశుద్ధితో ముందుకు రావాలని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి అన్నారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజల అర్జీలు నిర్లక్ష్యానికి గురికాకుండా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, అన్ని శాఖల అధికారులతో చర్చించారు. కార్యక్రమానికి మొత్తం 9 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.పేరూరు గ్రామంలో జాతీయ రహదారి నుంచి లైటింగ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్, విద్యుత్ శాఖకు సంబంధించి రెండు అర్జీలు,హౌసింగ్ పథకాలపై ఒక వినతి,తాగునీటి సమస్యలపై నాలుగు వినతులు అందాయని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించగా,తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో రెండు రోజుల్లో పరిష్కారం చూపుతామని అధికారులు హామీ ఇచ్చారు.కొన్ని అంశాలను అప్పటికప్పుడే పరిష్కరించారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు మాదవరెడ్డి, యశోద, ఎంపీడీవో రామచంద్ర, హౌసింగ్ డీఈ శ్రీరాములు రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తాసిల్దార్ కు వినతి పత్రం

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట మండలంలో గత ప్రభుత్వంలో పంచాయతీ పరిధిలోని 3,000 మంది లబ్ధిదారులకు ఏర్పేడు మండలం పాగాలి పంచాయతీలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వడం జరిగింది. కానీ ఇంత వరకు ఆ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు, మరేక్కడ కూడా కేటాయించిన దాఖలా లేదు. ఇప్పుడు ఉండే ప్రభుత్వం ఆ మండల ప్రాంత వాసులకు ఆ మండలాల్లో కేటాయిస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు పట్టించుకునే పరిస్థితి లేదు. 15 సంవత్సరాలుగా కూలి నాలి చేసుకునే పేద ప్రజలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వాళ్లే ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను చూపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు తులసి రాజన్ తాసిల్దార్ సురేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ వల్లి, సంజత్ భాయ్, రహంతుల్లా, రసూల్ భాష తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నియమ నిబంధనలు ఉలంగిస్తే చర్యలు

మండల కన్వీనరు మణినాయుడు

విశాలాంధ్ర-బుచ్చినాయుడుకండ్రిగ: క్రమశిక్షణకు పార్టీ కార్యకలాపాలు నిర్వహించడంలో ప్రత్యేకత కలిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కనుక క్రమశిక్షణను ఉల్లంగిస్తే చర్యలు తప్పవని మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కొనతనేని మణినాయుడు తెలిపారు. సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రకరకాల క్యాడర్ లో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్న ప్రతి ఒక్కరు పార్టీ క్రమశిక్షణకు లోబడి పని చేయాలన్నారు,మండల కన్వీనర్ , నియోజక వర్గ ఇన్ చార్జి ఆధ్వర్యంలో పార్టీకి సంబంధించి రకరకాల అధికారిక, అనధికారిక వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పార్టీ సస్పెండ్ చేసిన వ్యక్తితో ఎవ్వరైనా పార్టీ పేరుతో అధికారులను కలవడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంగించినట్లేనన్నారు. అలా ఎవ్వరైనా చేస్తే వారిపై పార్టీ చర్యలు తప్పనిసరిగా ఉంటాయని వెల్లడించారు. పార్టీ మనోభావాలు దెబ్బ తినకుండా, పార్టీ పూర్వపు వైభవాన్ని తీసుకురావడానికి పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యకమంలో వైస్సార్సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనరు వేలూరురాకేష్, జిల్లా క్రియా శీల కార్యదర్శి గోపాల్రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు రవిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి నాయకులు దేవదాసురెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ గురవయ్య, జయచంద్రనాయుడు, ఆశోక్, నాగూర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ శాఖ వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర -పూతలపట్టు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీ కోనుగుంట్ల కోటేశ్వరరావు గారు సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ శ్రీకృష్ణమోహన్ ఆదేశాల మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చిత్తూరు కార్యదర్శి వారు ఆదేశాల మేరకు వ్యాసవి విజ్ఞాన తరగతులు ఏప్రిల్ 28వ తేదీ నుండి జూన్ 6వ తేది వరకు జరుగును ఓరియంటేషన్ ప్రోగ్రాం జిల్లా గ్రంథాలయ సంస్థ చిత్తూరు శాఖ గ్రంథాలయం పూతలపట్టు నందు ఏరోజు పూతలపోటు ఎంఈఓ సి .వాసుదేవన్ జడ్పీ హైస్కూల్ పూతలపట్టు ప్రధానోపాధ్యాయులు మనోహర్ ఈ సమ్మర్ క్యాంపు లను సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి కర్పూరం వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ వాసుదేవన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ సమ్మర్ క్యాంపు చాలా ఉపయోగపడుతుందని. భవిష్యత్తులో మీరే మంచి విజ్ఞానవంతులుగా తయారవుతారని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు మనోహర మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ చాలా చక్కగా నిర్మించడం నేను చాలాసార్లు విన్నానని గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు ఒక దీక్షతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మంచి విషయాలను నేర్పిస్తారని. 18 అంశాల్లో నేర్పిస్తారని నేను చూశాను. లాస్ట్ ఇయర్ అని చెప్పి రవీంద్రబాబు ప్రసిద్ధి ఇచ్చారు రాష్ట్రమంతా మంత కూడా ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థుల బాగా ఎక్కువ మంది పాల్గొని. ఈ కార్యక్రమం లో విషయాలన్నీ తెలుసుకోవలసిందిగా కోరారు. జిల్లా ఎసిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు మందడి మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో చాలా చక్కగా పూతలపట్టు లో జరుగుతుందని విని వచ్చాను. అందుకే ఎవరైతే బాగా ప్రతిభ ఉన్నటువంటి వాళ్ళు ఫస్ట్ ప్లేస్ వచ్చినటువంటి వాళ్లకు 1000 రూపాయలు సెకండ్ ప్లేస్ వచ్చిన వారికి 750 రూపాయలు థర్డ్ ప్రైజ్ వచ్చినటువంటి వాళ్లకు 500 రూపాయలు బహుమతులు 6/62025. తేదీన ఇస్తామని.. ప్రకటించారు. అదేవిధంగా తెలుగు ఉపాధ్యాయులు కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సమ్మర్యాంపులో తెలుగు అక్షరాలు గాని చాలా కథలు గాని ఇంగ్లీష్ గ్రామర్ గాని యోగా గాని ఇలాంటి చక్కటి కార్యక్రమం ఉంటాయి కాబట్టి అందరూ కూడా వచ్చి వినియోగించుకోవాల్సిన కోరారు పద్యాలు కూడా నేనే వచ్చి నేర్పిస్తానని అందరికీ అని ఆయన తెలిపారు. సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్నటువంటి పుస్తకాలు చదవడం వల్ల ప్రతి వ్యక్తి విజ్ఞానవంతులగా తయారవుతారని ఆయన కొనియాడారు. .గ్రంథాలయ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా పాల్గొని ఈ కార్యక్రమంలో అన్ని 18 అంచాల పైన నేర్పించడం జరుగుతుందని. అందరూ కూడా మంచి విజ్ఞానవంతులుగా తయారవుతారని హ్యాండ్ రైటింగ్ అక్షరాలు ఎలా రాయాలి నేర్పించడం యోగ స్పోకెన్ ఇంగ్లీష్ డ్రాయింగ్ తెలుగు గ్రామర్ పుస్తకాలు చదవడం పాటలో నేర్పడం డ్యాన్సులు నేర్పడం కోలాటం నేర్పడం కరెంట్ అఫైర్స్ నేర్పించడం చేయించడం జరుగుతుందని విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు చివరగా ఎంఈఓ ప్రధానోపాధ్యాయుల చేతుల మీదగా పిల్లలకు బిస్కెట్లు ఇవ్వడం జరిగింది ఈ సమ్మర్ క్యాంపుకు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల వినూత్న అవగాహన

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొంది చేందుకు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి ట్రాఫిక్ పోలీసులు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు."హెల్మెట్ ధరించండి... మీ ప్రాణాలు కాపాడుకోండి" అనే నినాదంతో అధికారులు ముందుగా ప్రజలకు మానవీయ దృష్టికోణంతో సూచనలు ఇస్తున్నారు.ఈ క్రమంలో నగరంలోని టౌన్ కబ్ల్ జంక్షన్ వద్ద హెల్మెట్ లేకుండా వస్తున్న వాహనచోదకులను ఆపి,వారికి గులాబీ పువ్వులు అందించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, "హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఒక చిన్న పొరపాటుతోనే జీవితాంతం నష్టపోవాల్సి రావొచ్చు. మీరే కుటుంబానికి ఆధారస్తంభమైతే, మీరు లేకపోతే వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించండి" అని తెలిపారు.ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇది తప్పనిసరి భద్రతా చర్య అని అధికారులు సూచించారు.తదుపరి నుంచి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సున్నితంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సంజయ్ కుమార్,ఎస్ఐ విజయలక్ష్మి,ట్రాఫిక్ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.ఈ వినూత్న ప్రచార కార్యక్రమం పట్ల ప్రజలు ఆసక్తి చూపించారు.

గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర - పుత్తూరు : నారాయణవనం గ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా ప్రతి ఏడాది లానే ఈ సంవత్సరం కూడా హై స్కూలు విద్యార్థిని విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయధికారి యం.జీవన్ తెలిపారు.ప్రతి రోజు ఉదయం 8 నుండి 11 గం,, వరకు ఈ ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు, ఈ శిబిరంలో వివిధ విషయాల్లో శిక్షణలు స్పోకెన్ ఇంగ్లీషు, ఇంగ్లీషు గ్రామర్, కథలు వినుట, పుస్తక పఠనము, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనము,పెయింటింగ్, పేపర్ క్రాఫ్, ఆర్ట్ వంటి సృజనాత్మక అంశాలలో ఉచితముగా శిక్షణ ఇవ్వబడునని విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీసుకునే అవకాశం ఈ శిబిరం ద్వారా లభించనుందని కావున ఈ ఉచిత వేసవి శిక్షణా శిబిరాని హై స్కూలు విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పత్రికా ప్రకటన ద్వారా కొరుతున్నాము . పిల్లలకు ఉచితముగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిగల వారు ఎవరైనా వుంటే సెల్ నెంబర్ 8328235715 సంప్రదించవలసినదిగా కోరుతున్నాము.

పెరుమాల్‌గుంటను సర్వే చేసి

అన్యాక్రాంతం కాకుండా చూడండి

విశాలాంధ్ర - కార్వేటినగరం: పెరుమాల్ గుంటను సర్వే నిర్వహించి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఈడిగపల్లి గ్రామానికి చెందిన మహిళలు సోమవారం మండల తహసీల్దార్ నాగరాజుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ ఈడిగపల్లి గ్రామ సమీపంలో కొల్లగుంట లెక్కదాఖలాలో సర్వేనంబర్ 308/1లో 50 సెంట్ల విస్తీర్ణంలో పెరుమాల్ గుంట (ప్రభుత్వ భూమి) ఉంది. అయితే కొంత మంది రైతులు ఆ గుంట పరంబోకును ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. పెరుమాల్ గుంటలో గ్రామానికి చెందిన కులదైవం ఉన్నట్లు మా పెద్దల కాలం నుంచి అమ్మవారికి మొక్కులు తీర్చుకునే వారని తెలిపారు. ఆ లాంటి గుంట రోజు రోజుకి అన్యాక్రాంతం అవుతున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. అయితే రెవిన్యూ అధికారులు స్పందించి పెరుమాల్ గుంటను పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణను తొలగించి సర్వే రాళ్లు ఏర్పాటు చేసి గ్రామస్తుల అవసర నిమిత్తం వాడుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ను కోరామని, అందుకు తహసీల్దార్ కూడా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పలువురు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30న పాలీసెట్ ప్రవేశ పరీక్షలు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడులో పాలిసెట్ ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 30వ తేదీన రెండు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్య సంస్థ నిర్వహిస్తున్న పాలీసెట్ ప్రవేశ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి ఒక గంట వరకు జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షలు రాసే అభ్యర్థులందరూ హాల్ టికెట్తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్ను, హెచ్బి పెన్సిల్, ఏరాజ్, స్టాఫ్ నరు తెచ్చుకోవాలన్నారు. కాగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో హాల్ టికెట్ నెంబర్ 4141001 నుంచి 4141150 వరకు 150 మంది అభ్యర్థులు, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో 4151001 నుంచి 4151150 వరకు 150 మంది అభ్యర్థులు పాలీసెట్ ప్రవేశ పరీక్షలు జరుగుతుందన్నారు. పరీక్షలు రాసేవారు ఉదయం 10 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. 11 గంటల తర్వాత పరీక్ష కేంద్రానికి అనుమతించమన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-గూడూరు: అక్రమంగా గంజాయి విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసిన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ ఎస్ కే కరీమా బేగం తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్లు తనిఖీ చేస్తుండగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వినాయకుడి గుడి వద్ద అనుమానంగా సంచరిస్తున్న సెల్వ కుమార్ మోహన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతని వద్ద ఆరు కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకోవడమైనది .అతను ఆంధ్రప్రదేశ్ లోని నర్సీపట్నం లో కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలో సేలం జిల్లా చెట్టిపట్టు గ్రామంలో విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరిచినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పాల్గొన్నవారు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఏ.శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ ఏ.చెంచయ్య, కానిస్టేబుల్ టి నారాయణయ్య, మనోహర్, ఎం.రవి తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో

ఉచిత ప్రవేశాల షెడ్యూల్ మార్పు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు కోసం దరఖాస్తుల స్వీకరణ తేదీలు మే 2 నుండి మే 19, 2025 వరకు జరగనున్నాయి. ముందుగా ఏప్రిల్ 28న ప్రారంభించాల్సిన దరఖాస్తు ప్రక్రియను కొన్ని అనివార్య కారణాల వల్ల మార్పు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల డేటా ఆధారంగా, విద్యార్థుల అర్హతా పరిశీలన మే 20 నుండి మే 24 వరకు నిర్వహిస్తున్నట్లు,మొదటి విడత లాటరీ ఫలితాలు మే 29న సీటు పొందిన విద్యార్థుల ప్రవేశ నిర్ధారణ జూన్ 8న ఉంటుంది అని తెలిపారు. రెండో విడత లాటరీ ఫలితాలు జూన్ 11న సీటు పొందిన విద్యార్థుల ప్రవేశ నిర్ధారణ తేదీ జూన్ 18 ఉంటుంది అని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విధానము, అర్హులైన విద్యార్థులు తప్పనిసరిగా https://cse.ap.gov.in/ వెబ్సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనీ దరఖాస్తుతో పాటు ప్రస్తుత చిరునామా ధృవీకరణ కోసం ఆధార్ కార్డు, ఓటరుఐడీ, రేషన్ కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ , విద్యుత్ బిల్లు, అద్దె ఒప్పంద పత్రం (ఏదైనా ఒకటి) పత్రాలు సమర్పించాలని అన్నారు. పిల్లల వయస్సు ధృవీకరణ పత్రం (బర్త్ సర్టిఫికెట్ లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రం) వయస్సు అర్హతలు ఐబి, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలలు మార్చి 31 నాటికి పిల్లలకు 5 సంవత్సరాలు నిండాలని, స్టేట్ సిలబస్ పాఠశాలలు మే 31 నాటికి పిల్లలకు 5 సంవత్సరాలు నిండాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.

అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-పలమనేరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి వెంటనే పరిష్కరం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయం నందు పలమనేరు మున్సిపాలిటీ మరియు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల నుంచి సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు శాసన సభ్యులు యన్.అమర నాథ్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్ఓ. కె.మోహన్ కుమార్, ఆర్డిఓ. భవాని, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్ లతో కలసి అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. పలమనేరు మున్సిపాలిటీకి చెందిన పి.చెంగమ్మ నాకు 75 సంవత్సరాల వృద్ధాప్య పెన్షన్ కొరకు గ్రామ సచివాలయంలో మున్సిపల్ కార్యాలయంలో చాలాసార్లు అర్జీలు ఇవ్వడం జరిగినదని నాకు పెన్షన్ మంజూరు చేయలేని దయచేసి నాకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీని జిల్లా కలెక్టర్ కి అందజేశారు. పలమనేరు మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన టి.లక్ష్మయ్య నాకు చెందిన 24 సెంట్లు భూమికి 1 బి, పాస్ బుక్ అడంగల్ నందు ఎక్కించాలని కోరుతూ అర్జీని జిల్లా కలెక్టర్కు అందజేశారు. గంగవరం మండలం ఎస్ ఆర్ నగర్ వాసులు తమ లే ఔట్ లో 2018 ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని, లో ఓల్టేజ్ కారణంగా విద్యుత్ సమస్యలు వస్తున్నాయన్నారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి రుసుము చెల్లించామని, ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయలేదని, దీని కారణంగా మోటార్ లు, టివి, ఫ్రిడ్జ్లు తదితర వస్తువులు నాశనం అవుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకోవాలని ట్రాన్స్ కో ఎస్ఈ ని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, పలమనేరు ఆర్డీఓ భవానీ, జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు,పి ఆర్ ఎస్ ఈ చంద్ర శేఖర్ రెడ్డి, డ్వామా పిడి రవికుమార్, డిపిఓ సుధాకర్ రావు, డిఆర్డిఏ, ఐసిడిఎస్ పిడిలు శ్రీదేవి, వెంకటేశ్వరి, ఏపీ ఎస్పిడిసిఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, ఏడి సర్వే జయ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, డి ఎల్ డి ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల పర్య వేక్షకులు, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఇతర డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి ఎన్డీఏ ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: మహిళల సాధికారత కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన తెలిపారు. ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సిఎన్సి సెంటర్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం ప్రారంభించారు. బిసి కార్పొరేషన్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణను ప్రభుత్వం అందిస్తోంది. తొంభై రోజుల పాటు జరిగే ఈ శిక్షణకు 360మంది మహిళలు ఎంపికైయ్యారు. మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు అవసరమైన అన్ని చర్యలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కుట్టుమిషన్ నేర్చుకోవడం ద్వారా మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడేందుకు వీలుకలుగుతుందని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతిపదికన కుట్టు మిషన్ శిక్షణకు మహిళలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్స్ ను అందిస్తోందని ఆయన చెప్పారు. అలాగే తల్లికి వందనాన్ని పాఠశాలలు తెరిచే నాటికి అమలు చేస్తుందని ఆయన తెలిపారు. మహిళ సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నెరువేరుస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ఈడి శ్రీదేవి, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయిబ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్స్ ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ ఎస్ కే బాబు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వేదికలో అర్జీలకు నాణ్యతగా పరిష్కారం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయమునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ ప్రజా పరిష్కార వేదిక ఆవరణంలో అర్జీదారులకు అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్తో పాటు డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ -145, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ -7, సివిల్ సప్లై -7, పోలీస్ శాఖ - 12, ఆర్ డబ్ల్యు ఎస్ -5, ఎస్ఎస్ఎల్ఆర్ -10, పంచాయతీ రాజ్ - 28, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ -2, విద్యా శాఖ -15, ఏపీఎస్పీడిసిఎల్ -2, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ -3, రూరల్ డెవలప్మెంట్ -3, హౌసింగ్ -5, రూరల్ పావర్టీ - 14, ఎంప్లాయ్ మరియు ట్రైనింగ్ -2, సాంఘిక సంక్షేమ శాఖ-2, ఐసిడిఎస్ -2, ఎస్ సి ఫైనాన్స్ కార్పోరేషన్ -3, జి ఎస్ డబ్ల్యు ఎస్-1, పబ్లిక్ హెల్త్ -9, నేషనల్ హై వే -2, మత్స్య శాఖ -1, ఆర్ అండ్ బి -1, టూరిజం మరియు డెవలప్మెంట్ -2, ఎక్సైజ్ శాఖ -1, బి.సి. వెల్ఫేర్ -1 వెరసి మొత్తం 285 వినతులు రావడం జరిగింది.

మిడ్ డే మీల్స్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర-చిత్తూరు: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు స్కూలు స్వీపర్లకు కనీస వేతనం18 వేల రూపాయలు ఇవ్వాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు .సోమవారం మిడ్ డే మీల్స్ వర్కర్ల స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని చిత్తూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద వర్కర్లతో ధర్నా నిర్వహించారు మిడ్ డే మీల్స్ వర్కర్లకు స్కూల్ స్వీపర్లకు పెండింగ్ జీతాలు బిల్లులు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గ త 22 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మీల్స్ వర్కర్లుగా పనిచేస్తున్నారని పిల్లలకు నాణ్యమైన భోజనం వండి పెడుతున్నారని ఆయన తెలిపారు ప్రభుత్వం డబ్బులు ఇచ్చిన ఇవ్వకపోయినా సొంత డబ్బులు సైతం ఖర్చు పెట్టి నిత్యవసర వస్తువులు కొనిపిల్లలకు భోజనం పెడుతున్నారన్నారు . మహిళలతో వెట్టిచాకరి చేయించుకుంటూ వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా పిల్లల డబ్బులు 15 రూపాయలకుపెంచాలని సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు గత ఆరు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లుగా పని చేస్తున్నారని 6000 తో సరిపెడుతున్నారని ఒక కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎక్కడ సరిపోతుందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు మిడ్ డే మీల్స్ వర్కర్లకు. స్కూల్ స్వీపర్లకు 18 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించుకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు అమ్ములు మంజుల శారద సుశీల కమలమ్మ సరస్వతి శ్రీదేవి జగదా అనురాధ జ్యోతి గిరిజ పవన మిడ్ డే మీల్స్ వర్కర్లు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఛైర్మన్గా

దొంగోడు నాగేశ్వరరావు

విశాలాంధ్ర-వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దొంగోడు నాగేశ్వరరావును సోమవారం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో నెల్లూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్గా ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. అయితే 2014 తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఈయనకు రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ గాను పెంచలకోన దేవస్థానం ఛైర్మన్గాను నామినేటెడ్ పదవులు అలంకరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగిన ఈయనకు జిల్లాస్థాయి పదవి రావడం సంతోషంగా ఉందని ఆయన అభిమానులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.